# లోగుట్టు

- పంజాల జగన్నాథం.

అప్పుడే బస్సు దిగాను. జనవరి మాసం. ఆకాశమంతా మబ్బుపట్టింది. చల్లటి వాతావరణం. ఈదురుగాలి. అక్కడక్కడా ఆకాశంలోకి ఎగబాకిన తాటిచెట్లు. తాటాకుల గలగల చప్పుళ్లు. జలజల పారే ఏరు. ఏటి ఒడ్డునానుకుని అడవి. ఓ వారం రోజులు పనిమీద టౌనుకు వెళ్లి వస్తున్నాను. ఏరుదాటి పంటపొలాల గుండా మా ఊరు దారిపట్టాను.

ఊరి ప్రవేశంలో విస్తరించిన ఎత్తయిన మర్రిచెట్టు. చెట్టుమీద పక్షుల "కిలకిల"రావాలు. రైతులు నాగళ్లను ఎడ్లకు బిగించి పొలాలకు తోలుకెళుతున్నారు. చద్దులు మోసుకుంటూ వ్యవసాయ కూలీలు వడివడిగా చేలల్లోకి పోతున్నారు. పసులగాసే పాలెగాండ్లు బర్లను మందలు మందలుగా తోలుకెళుతున్నారు చెలకకు మేపడానికి. పాల కొరకు దూడల అరుపులు. పెంటకుప్పల్లోకి మేత కొరకు తల్లి వెంట కోడి పిల్లల పరుగులు. ఊరంతా ఉదయపు సందడి.

ఊళ్లోకి ప్రవేశించాను. ఊరు మంచు దుప్పటిలో ఒదిగిపోయింది. అక్కడక్కడ మూగిన జనంలో ఏవో గుసగుసలు. దార్లో కనబడుతున్న మనుషుల్లో ఏదో తెలియని భయాందోళనలు. ఊరంతా స్తబ్దంగా, గంభీరంగా కనబడుతోంది. ఎందుకో నా మనస్సు కీడును శంకిస్తోంది. ఇల్లు చేరుకున్నాను. నా భార్య కమలమ్మ కల్లాపి చల్లుతోంది. నన్ను చూసి ఓ క్షణం నోరెల్లబెట్టింది. ఆమె ముఖంలో ఆందోళన. ఏదో విషయం నాతో చెప్పాలని నోటిదాకా తెచ్చుకుంది. ఇట్లా రాగానే ఎందుకులే అని అనుకున్నదేమో! విషయం చెప్పకుండానే ఇంట్లోకి వెళ్లింది. ఏమై ఉంటుందా?! అని మనస్సు పీకుతోంది. ముఖం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ "ఏమేవ్ కమలమ్మా! కొంచెం వేడి చాయ్ తీసుకురావే!" కేకేశాను. పొగలు కక్కే వేడి చాయ్ గ్లాస్ నా చేతికందిచ్చింది. నిశ్శబ్దంగా నిలుచుని నావైపే చూస్తోంది. విషయం చెప్పి నా మనస్సును చికాకుపర్చడం ఎందుకని మిన్నకున్నట్లుంది.

ఇంటి ముందర నులక మంచం మీద కూర్చున్నాను. వేడి చాయ్ రెండు గుక్కలు తాగాక మనస్సుకు హాయి అనిపించింది. చలితో వణుకు పట్టిన శరీరం తేరుకోసాగింది. ఇంతలో బజారు నుండి పరుగులాంటి నడకతో మొసపోసుకుంటూ ఇటువైపే వస్తున్నాడు చాకలి వీరయ్య.

"రంగన్నా! ఎప్పుడొచ్చినవే ఊరంతా అట్టుడుకుతోంది" భయంతో వణికిపోతున్నాడు చాకలి వీరయ్య. వాడి వాలకం చూస్తే పరేశాన్‌గా ఉంది.

"ఒసే కమలమ్మా! ఇంకో గ్లాసు వేడి చాయ్ తీసుకురావే వీరయ్యకు." కమలమ్మ వీరయ్యకు చాయ్ గ్లాసు అందించింది. భయంతోనే కూచుని చాయ్ తాగాడు. వీరయ్య కొంచెం తేరుకున్నాడు.

"ఇప్పుడు చెప్పరా ఏం జరిగిందో?" అడిగాను వీరయ్యని.

"రంగన్నా! మనూరి పొలిమేర మోతుకు వనంలో..." చెవిలో మెల్లిగా చెప్పాడు. వింటూనే నిర్ఘాంతపోయాను. నాలో ఎన్నో ఆలోచనలు... అవి రంగులు మార్చుకోసాగాయి. గతకాలపు సంఘటనలు ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి.

- - -

మా ఊళ్లో రాఘవయ్య ఓ పెద్దమనిషి. నూరు ఎకరాల ఆసామి. ఊరి వ్యవహారాలన్నీ రాఘవయ్య గుప్పిట్లోనే. తను గీచిన గీత జనం దాటకూడదు. అమాయక జనం. గొర్రెదాటు. ఒక్కమాటలో చెప్పాలంటే రాఘవయ్య ఆ ఊరికి మకుటం లేని మహారాజు.

మంగలి మల్లయ్య ఓ సన్నకారు రైతు.




ఆరడుగుల ఆజానుబాహుడు. కండపుష్టి కల్గిన మనిషి. ముడతలు పడిన శరీరంలో వృద్ధాప్యపు ఛాయలు తొంగి చూస్తున్నాయి. పెద్ద కళ్లు, ఎత్తయిన నుదురు, దానిపై సింధూరపు బొట్టు, తెల్లని గుంగురు జుత్తు, మెడలో రుద్రాక్ష మాలలు, బుర్ర మీసాలు. మల్లయ్య భారీ విగ్రహాన్ని చూస్తూనే పిల్లలు జడుసుకునేవారు. మల్లయ్య కైదండలకు తాయెత్తులు, కాళ్ల పిక్కల్లో దివ్య శక్తులు గల యంత్రాలను అమర్చుకున్నాడనీ, మధ్యరాత్రి వాగులో దిగంబరంగా స్నానం చేసి ఎముకల రాట్నం తిప్పుకుంటూ ఏవో మంత్రాలు వల్లిస్తుంటాడనీ, తద్వారా అతనికి అద్భుత శక్తులు సంక్రమిస్తాయని ప్రజల్లో ఏవేవో పుకార్లు.

మంగలి మల్లయ్య ఊరి వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. నిజాయితీ గల మనిషి. పేదల పక్షాన నిలబడేవాడు. వాళ్ల కష్టాలే తన కష్టాలుగా భావించేవాడు. అందుకే మల్లయ్య మాటంటే ఊరి జనానికి బాగా గురి. ప్రజల్లో పలుకుబడి గల మల్లయ్య అంటే రాఘవయ్యకు అసూయ. ఎక్కడ రాజకీయంగా తనను మించి పోతాడోనని గుబులు.

రాఘవయ్య చేను పక్కనే భూమయ్య రైతు చేను. ఓ రోజు తెల్లారేసరికల్లా ఓ కోంఢ్రపెట్టు భూమయ్య చేనులోకి దూసుకెళ్లి 'హద్దుకని' పాతారు రాఘవయ్య మనుషులు. "ఏమిటీ అన్యాయం!" అని రాఘవయ్యను అడిగితే ''అదంతే, ఏంజేసుకుంటావో జేసుకో పోరా!" అంటూ నిర్లక్ష్యంగా తన మనుషులతో భూమయ్యను

మెడలుపట్టి గెంటివేయించాడు. నిజామాబాద్ నుండి బతుకుతెరువుకు వలస వచ్చిన రాఘవయ్య గిరిజనుల, హరిజనుల భూములు, గుడి మాన్యాలు అన్నీ కబ్జా చేసుకుని నేడు వంద ఎకరాల ఆసామి అయినాడు. రాఘవయ్య చేసిన దౌర్జన్యానికి, దురాక్రమణకి భూమయ్య ఏమీ బదులు చేయలేని బలహీనుడు. రాఘవయ్య తన పాలేరు కొమురయ్య పెండ్లాం చుక్కను కళ్లు కామంతో కప్పుకుపోయి చేన్లో బలాత్కరించి చెరిచాడు. ప్రాధేయపడ్డా వినలేదు. అడిగే దిక్కూ మొక్కూ లేదు. రాఘవయ్య ఆగడాలకు చరిత్రలో పుటలే చాలవు. ఏదో ఒక దశలో అందరూ రాఘవయ్య ఇనుప పాదాల కింద నలిగిన వాళ్లే.

ధనకాంక్ష, పదవీ వ్యామోహం మితిమీరిన రాఘవయ్య తను ఆలోచనా విధానంలో మరుగుజ్జు అయ్యాడు. డబ్బూ, పదవీ కాపాడుకునే ప్రయత్నంలో మృగంగా మారాడు. రాఘవయ్య ఆడే కపట రాజకీయంలో అమాయక ప్రజలే పావులు. ఆడవాళ్లపై అత్యాచారాలు, కులాల కుమ్ములాటలు, వర్గ పోరాటాలు, గెట్ల తగాదాలు, నీటిపారుదల, కరెంటు సరఫరా, ప్రభుత్వ సబ్సిడీలు, రేషన్ దుకాణాలు, స్వాతంత్ర్య సమరయోధుల, వృద్ధుల పింఛన్లు లాంటి పలు సమస్యలతో ఊరు భగ్గుమంటూనే ఉంది.

సబ్సిడీపై ఋణాలు, పింఛన్లు, భూమి పట్టాలు అన్నీ బినామీ పేర్లే. అసలు లబ్ధిదారులను అడిగేవారు లేరు. 'బడి' చైతన్యానికి ప్రతీక. కానీ సక్రమంగా నడవదు. రక్షిత మంచినీటి పథకం నామమాత్రమే. త్రాగునీరు, సాగునీరు, గిరిజన, హరిజనాభివృద్ధి అన్నీ కాగితాల మీదనే.

అతుకుల బొంత లాంటి జీవితాలని ఇన్నాళ్లు రాఘవయ్య బారినపడి చిరిగిపోకుండా కాపాడుకోడానికే తంటాలు పడుతున్నారు సామాన్యులు. అంగలార్చడమే తప్ప ఏమీ చేయలేని అసహాయులు. దురహంకారం రాజ్యమేలుతోంది.

– – –

ఆ రోజు మంగలి మల్లయ్య పొలానికి నీరు పారించాల్సిన వంతు. రాఘవయ్య మనుషులు మల్లయ్య పొలానికి అడ్డుకట్ట వేసి కాలువను రాఘవయ్య పొలానికి మళ్లించారు. 'ఇదేమిటీ– అన్యాయం' అని మల్లయ్య అడిగితే అతనిపై పశుబలం ప్రదర్శించారు రాఘవయ్య మనుషులు. అవమానం తట్టుకోలేని మల్లయ్య గుండెల్లో 'కోపం' కణకణమండే నిప్పు కణికలా రగిలింది. వెంటనే రాఘవయ్య వద్దకు వెళ్లాడు. "రాఘవయ్యా! గా పాత రోజులు బోయినయి. గీ జబరదస్తీ, జులుం ఇగముందు సాగవు. మనుషులు తెలివి కచ్చింద్రు. గంజిలో ఉప్పులేక మేమేడ్వుంటే, పాయసంలో ఏలకులు తక్కువయినాయని నువ్వేడుస్తున్నవ్" అంటూ చెర్నకోలాతో కొట్టినట్టుగా నిలదీశాడు మల్లయ్య రాఘవయ్యని.

"అరేయి మంగలి మల్లిగా! నీకెంత ధైర్యంరా! ఎంత పొగరురా! నన్నే ఎదిరిస్తావా!" అంటూ అహంకారంతో రంకెలు వేశాడు రాఘవయ్య.

"రాఘవయ్యా! జరా మర్యాదగా మాట్లాడు. మంగలోళ్లు గడ్డాలు గీయకుండా, చాకలోళ్లు బట్టలుతకకుండా, కుమ్మరి, కమ్మరి, వడ్రంగులు పాత్రలు పనిముట్లు చేయకుండా, కూలీలు చేనుపని చేయకుండా ఉంటే మీ పరిస్థితులు ఎట్లుంటయో ఆలోచించుకో"– ధైర్యంగా సవాలు విసిరాడు మల్లయ్య.

మల్లయ్య మాటల ఈటెలు రాఘవయ్య గుండెల్లో శూలాల్లా గుచ్చుకున్నాయి. అతని అహం దెబ్బతింది. ఊహించని పరిణామానికి ఖంగుతిన్నాడు రాఘవయ్య. క్రోధాగ్నితో భగభగ మండిపోయాడు. 'కాగల కార్యం గంధర్వులే నెరవేర్చునట్లు' తన చేతులకు మట్టి అంటకుండా కార్యాన్ని సాధించగల నేర్పరి రాఘవయ్య.

వూ ఊరు కష్టాల కాష్టంపై దహించబడుతోంది. శాంతి భద్రతలు మాకో నమస్య. అన్యాయంగా హించించి అణగదొక్కబడిన ప్రతి ఒక్కడూ గతిలేక, విధిలేక తిరగబడుతున్నాడు. బీభత్స సమాజంపై మంగలి మల్లయ్య సమరగర్జన చేశాడు. సింహాసనం కూల్చే శతఘ్ని లాంటి మల్లయ్య సవాళ్లకి 'ఊరి పెత్తనం' వణికింది. పెద్దరికపు సింహాసనం పునాదులు

కదిలాయి.

ఊరి చావిడిలో కొలిమి. రైతులు, వ్యవసాయ కూలీలు తమ పనిముట్లను పదును చేసుకుంటున్నారు. ఊరి సమస్యల చర్చావేదిక అక్కడే.

"అరేయ్ దుర్గా! గంత ఘోరం ఎట్లా జరిగిందిరా?!" కొలిమి చక్రం తిప్పుకుంటూ మంటను రాజేస్తూ అడిగాడు కమ్మరి సత్తయ్య.

"చెప్పులు కుట్టుకుని బతికెటోన్ని బాంచన్! గవన్నీ గీ కుక్కల కొడుక్కేం తెలుస్తయి!" నమ్మెట పోటు వేస్తూ సమాధానం చెప్పాడు మాదిగ దుర్గయ్య. అతని కంఠంలో భయం, బాధ ధ్వనిస్తున్నాయి.



AKBAR

ఊళ్లో అమ్మవారయింది. మరోసారి గత్తర వ్యాపించింది. చాలామంది చనిపోయారు. ఊరంతా కమురు వాసన కొడుతున్న శవాల కంపు. అదంతా పోచమ్మ, మైసమ్మ (గ్రామ దేవతలు)ల కొంటెతనమనీ (మహిమ) మంగలి మల్లయ్యే తన మంత్రశక్తులతో ఊరి మీదకి ఆ దేవతలని ఉసిగొల్పాడని నీలివార్తల ప్రచారం సాగింది.

టౌను నుండి వచ్చీ రాగానే చాకలి వీరయ్య చెప్పిన వార్త విని నిశ్చేష్టుడినయ్యాను. గుండెలు జలదరించాయి. నా నవనాడులు కుంగిపోయాయి. చరచర భూమి పగిలి తెరిచిన నెర్రెలో కూరుకుపోతున్నట్లు అనిపించింది. ఎంత అన్యాయం జరిగింది! నాలో నేను మధనపడ్డాను.

\- - -

అజ్ఞాతం రౌద్రరూపం దాల్చింది. ఊరి గర్భం నిండిన 'మూఢ విశ్వాసం' అగ్నిపర్వతంలా భగ్గుమని బద్దలయింది. ఊరి వెలువల మోదుగువనం... రక్తపు మడుగు... నెత్తురోడుతున్న బుర్రమీసాల దేహం... ఆయువు అనంత వాయువుల్లో...

చేదు నిజాలను బహిరంగపర్చడం, ఆలోచనకి, ఆచరణకి మధ్య గల అగాధాలను బట్టబయలు చేయడం, అన్యాయాన్ని నిష్కర్షగా ప్రశ్నించడం మల్లయ్య చేసిన నేరాలు. అవే మల్లయ్యని బలి తీసుకున్నాయి.

మల్లయ్య కుటుంబం ఊరు వదిలి వెళ్లిపోయింది. 'ఊరి పెత్తనం' మీసాలు మెలివేస్తూ క్రూరంగా నవ్వింది. మూఢవిశ్వాసాల పెంపకం రాఘవయ్య రాజకీయాల్లో భాగం. లోగుట్టు తెలియని ప్రజలు మోసపోయారు.

అమానుష చిత్రహింసలకు కుప్పకూలిన మంగలి మల్లయ్య ఏ జాతికి వారసుడు? స్వార్థ చింతనతో తెరవెనుక నాటకమాడే రాఘవయ్య ఏ పాలనా వ్యవస్థకి ప్రతిబింబం? ఇప్పటికీ చెప్పుకోలేని ఈ ప్రశ్నలు నా మస్తిష్కాన్ని తొలుస్తూనే ఉన్నాయి.

(13.2.99 నాడు వార్తాపత్రికలలో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి గ్రామంలో మంత్రగాళ్లన్న నెపంతో అయిదుగురి సజీవ దహనం వార్త చదివి...)

O